ప్రజాశక్తి
సోమవారం 8 జులై 2024
అనంతపురం





విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ

విభజన హామీలు పరిష్కరించుకోవాలి

సిపిఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్ రెడ్డి రాష్ట్ర విభజన అంశాల సమస్యల పరిష్కారంపై భేటీ కావడం అభినందనీయమని ఈ భేటీలో విభజన హామీలు పరిష్కరించుకోవాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ పేర్కొన్నారు. ఆదివారం అనంతపురం జిల్లాకు వచ్చిన ఆయన నీలం సంజీవరెడ్డి భవన్ లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మద్దతు అవసరం ఉందని ఈ సమయంలోనే ప్రత్యేక హోదా సాధించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కషి చేయాలని కోరారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకొచ్చిన క్రిమినల్ అమెండ్మెంట్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వానికి ఓట్లు, సీట్లు తగ్గినా ప్రధానమంత్రి మోడీకి మాత్రం అహంభావం ఇంకా తగ్గలేదని అన్నారు. మూడోసారి అధికారం చేపట్టగానే ప్రజా కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను వేగవంతంగా అమలు చేస్తున్నారని, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా చట్టాలు చేస్తూ కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. అందులో భాగంగానే ప్రతిపక్షాల ఎంపీలను బయటకు పంపి ఏకపక్షంగా ఇటీవల క్రిమినల్ అమెండ్మెంట్ చట్టాన్ని పాస్ చేశారని విమర్శి:చారు. ఈ చట్టం కార్మికులు, శ్రామికులకు, ఆందోళనకారులకు తీవ్ర నష్టం కలిగించే చట్టమని ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో రాష్ట్రంలో ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు నీతి నిజాయితీతో సేవలందించి రాజ్యాంగ స్ఫూర్తిని పెంపొందించాలన్నారు. అయితే ఇటీవలి కాలంలో ఏ ప్రభుత్వం ఉంటే ఆ ప్రభుత్వం నాయకుల అవినీతి అక్రమాలకు సహకరిస్తూ ఆ ప్రభుత్వాలు పడిపోగానే అప్పుడు పని చేసిన ఐఎఎస్, ఐపిఎస్‌లు జైళ్ల పాలవుతున్నారని అన్నారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. అవినీతి అక్రమాలకు ఐఎఎస్ ఐపిఎస్ లు దూరంగా ఉండి ప్రజలకు సేవలు అందించాలని కోరారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి అభివృద్ధితో పాటు ఇతర విషయాలను కేంద్రంతో ప్రస్తావించాలన్నారు. రాష్ట్రంలో ఆల్ పార్టీ మీటింగ్ నిర్వహించి కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్రానికి రావలసిన హక్కులను సాధించేలా ఒత్తిడి చేయాలని కోరారు. గత ప్రభుత్వాలు చేసిన తప్పిదాలను ఈ ప్రభుత్వం చేయకూడదని ఆశిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సి జాఫర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి నారాయణస్వామి, మల్లికార్జున, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

క్రాస్‌రోడ్‌లో సమన్వయకర్తలు

పాత స్థానాల్లో నిలబడేరా ?
ఎటూ తేల్చుకోలేని స్థితిలో నాయకులు
గందరగోళంలో వైసిపి శ్రేణులు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ఘోర ఓటమి తరువాత ఆపార్టీ సమన్వయకర్తలు ఎటువైపు ఉండనున్నారన్నది ఆసక్తికరంగా మారింది. ఎన్నికలకు ముందు కొన్ని నియోజకవర్గాల్లో వైసిపి మార్పులు, చేర్పులు చేపట్టింది. ఈ మార్పులు జరిగిన చోట తోపాటు, పాతవారున్న చోట కూడా ఎన్నికల్లో ఘోర ఓటమినే వైసిపి చవిచూసింది. పాత స్థానాల్లో ఎటువంటి మార్పుల్లేకపోవడంతో అక్కడ సమన్వయకర్తలుగా వారే ఉంటున్నారు. కాని మార్పులు జరిగినచోట ఇప్పుడు విచిత్రమైన పరిస్థితి నెలకొంది. కొత్తగా నియమించిన చోట ఉండాలా లేక పాత స్థానాల్లో వెళితే ఎలాగుంటుదన్న మీమాంసలో ఉన్నట్టు చర్చ నడుస్తోంది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో సుమారు ఏడు స్థానాల్లో మార్పులు చేపట్టింది. ఈ మార్పులు జరిగిన చోట కొత్తగా బాధ్యతలు తీసుకున్న వారు ముందుకు పోలేకపోతున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన ఉషచరణ్ శ్రీని పెనుకొండకు మార్చారు. ఆమె పెనుకొండలో పోటీ చేసి ఓటమి చెందారు. దీంతో ఆమె ఇక్కడ ఉంటుందా లేక పాత స్థానానికి పోతుందా అన్న చర్చ నడుస్తోంది. ఇక పెనుకొండలో అంతక మునుపు ప్రాతినిధ్యం వహిస్తున్న శంకర నారాయణను ఎన్నికల సమయంలో అనంతపురం పార్లమెంటుకు మార్చారు. ఆయనకు పెనుకొండలో అనుయాయులు ఉన్నారు. దీంతో అక్కడకెళ్లేందుకు ఆయన ఆసక్తిగా ఉన్నారన్న చర్చ నడుస్తోంది. ఇక కదిరిలోనూ అదే పరిస్థితి నెలకొంది. కదిరిలో అంతక మునుపు ఎమ్మెల్యేగా సిద్ధారెడ్డికి ఈసారి టిక్కెట్టు ఇవ్వలేదు. ఆయన స్థానంలో మక్బుల్ బాషాను తీసుకొచ్చారు. అప్పటి నుంచి సిద్ధారరెడ్డి మౌనంగా ఉంటూ వస్తున్నారు. అయితే ఇటీవలి కాలంలో సిద్ధారెడ్డి, మక్బుల్ వర్గీయులు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. రెండు గ్రూపులకు చెందిన వారు ఒకరినొకరు కొట్టుకున్నారు. దీంతో ఇప్పుడు ఎవరు ఇక్కడ కొనసాగుతారన్నది కూడా అయోమయంగానే ఉంది. శింగనమల నియోజకవర్గంలోనూ అదే రకమైన పరిస్థితి నెలకొంది. అంతక మునుపు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి కాదని వారు సూచించిన వీరాంజినేయులును సమన్వయకర్తగా నియమించారు. ఎన్నికల్లో ఆయన ఓటమి చెందారు. అప్పటి నుంచి ఆయన ఎక్కడున్నాడో తెలియకుండా ఉంది. ముందు ఎమ్మెల్యేగా ఉన్న జొన్నలగడ్డ పద్మావతి కూడా ఎక్కడా కనిపించడం లేదు. దీంతో ఇక్కడ వైసిపికి నడిపించే నాయకుడెవరన్నది తెలియని అయోమయం నెలకొంది. మడకశిరలోనూ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి స్థానంలో వీరలక్కప్పను తీసుకొచ్చారు. ఇద్దరిలో ఎవరు పార్టీ బాధ్యతలను ఇకపై చేపడతారో తెలియదు. ఇలా మార్పులు చేపట్టిన స్థానాల్లో వైసిపిని నడిపించేది ఎవరన్న సందేహంగా మారింది. పాతవారేమో ముందు స్థానాలపైనే మనసు పెట్టుకుని ఉండగా, కొత్తవారు ఈ సమయంలో బాధ్యతలు తీసుకునేందుకు సిద్ధపడటం అనుమానాస్పదంగా ఉంది. ఇలా కొత్త సమన్వయకర్తలున్న చోట నేతలు క్రాస్ రోడ్‌లో నిలబడినట్టయింది. ఎటు వెళ్లాలో తేల్చుకోలేకపోతున్నారు. కొన్ని చోట్ల ఇప్పటికే వైసిపి సమన్వయకర్తల మార్పులు చేపట్టినట్టు ప్రచారం నడుస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలోనూ మార్పులు ఉంటాయా అన్నది చూడాల్సి ఉంది.

మందులు, పరికరాలపై జీఎస్టీ ఎత్తేయాలి

ఎపి ఎంఎస్ఆర్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.వెంకటరావు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మందులు, పరికరాలపై కేంద్ర ప్రభుత్వం వెంటనే జీఎస్టీని ఎత్తివేయాలని ఎపి ఎంఎస్ ఆర్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.వెంకటరావు డిమాండ్ చేశారు. ఆదివారం అనంతపురంలో ఎపిఎంఎస్ఆర్‌యు జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందుల ధరలు నిర్ణయించే పద్ధతిలో ప్రభుత్వం ప్రకటించే తప్పుడు విధానాలు, ద్రవ్యోల్బణం, ఇండియన్ రూపాయి విలువ తగ్గడంతో మందుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. 70శాతంపైన మందుల తయారీకి కావాల్సిన ముడి సరుకులు చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్నామన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. ఈ పరిస్థితుల్లో భారత ప్రభుత్వం మందులు, మందుల పరికరాలపై జీఎస్టీ విధించడం వల్ల మందులు ధరలు మరి విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. తద్వారా పేదలు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి దాపురిస్తుందన్నారు. కావున కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి మందులు, మందుల పరికరాలపై జీఎస్టీని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథ్, అనంతపురం శాఖ కార్యదర్శి మంజు, అధ్యక్షుడు అమర్నాథ్, తదితరులు పాల్గొన్నారు.

ముస్కిన్ ఆశయాలను కొనసాగిస్తాం

సంతాప సభలో సిపిఎం నాయకులు



ముస్కిన్ సంతాప సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. రాంభూపాల్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ముస్కిన్ ఆశయాలను కొనసాగిస్తామని పలువురు వక్తలు అన్నారు. ఇటీవల హఠాత్తుగా మృతి చెందిన సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ముస్కిన్ సంతాప సభ సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. గుత్తి రోడ్డు లోని ఐదురెట్ల వద్ద సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సంతాప సభకు ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు శుభహాన్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి రాంభూపాల్, సిపిఐ నగర కార్యదర్శి శ్రీరాములు, వైసిపి నాయకులు కె.వి. రమణ, ఇన్సాఫ్, నాయకులు బంగారు భాష, ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు వలి, రాజు కాలనీ ఉపసర్పంచి మసూద్, సిపిఎం నాయకులు తదితరులు హాజరయ్యారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు, ఆవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముస్కిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు సుబహాన్ మాట్లాడుతూ ముస్కిన్ ఆవాజ్ కమిటీలో చురుకైన పాత్ర వహిస్తూ ముస్లిం మైనారిటీల హక్కుల సాధనకు, సమస్యల పరిష్కారానికి ఎనలేని పోరాటాలు కొనసాగించారన్నారు. ఎన్ఆర్‌సి, సిఎఎ చట్టాల రద్దు కోసం నిర్వహించిన పోరాటంలో విశేష పోరాటం చేశారని, ముస్లిం మైనారిటీలను ఐక్యం చేసి పోరాటం మార్గంలో నడిపించడంలో తనదైన పాత్ర పోషించాడని గుర్తు చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. రాంభూపాల్ మాట్లాడుతూ ముస్కిన్ మృతి సిపిఎంకి తీరని లోటు అన్నారు. పేదలు, కార్మికులు, కర్షకుల కోసం సిపిఎం నిర్వహించిన పోరాటంలో ముస్కిన్ చురుకైన పాత్ర పోషించారని తెలిపారు. పేదలకు ఇళ్లస్థలాల కోసం, కాలనీలో సమస్యలు పరిష్కారం కోసం ఎన్నో పోరాటాలు కొనసాగించారని గుర్తు చేశారు. క్రమశిక్షణ కలిగిన నాయకుడిని పార్టీ కోల్పోవడం బాధాకరం అన్నారు. పేదల పక్షాన నిలబడిన ముస్కిన్ ఆశయాలను కొనసాగిస్తామని తెలిపారు. సిపిఎం నగర ఒకటో కమిటీ కార్యదర్శి వి రామిరెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని పలు కాలనీల్లో డ్రైనేజీ, నీరు, రోడ్ల సమస్యలపై ముస్కిన్ రాజీలేని పోరాటాలు కొనసాగించారని గుర్తు చేశారు. పార్టీకి ఎంతో అండగా ఉన్న ముస్కిన్ తనకు మిత్రుడుగా సోదరుడిగా మెలిగాడని క్రమశిక్షణ కలిగిన నాయకుడిని కోల్పోవడం ఎంతో బాధిస్తుందని అన్నారు. ఆయన ఆశయాల కొనసాగించడమే ముస్కిన్‌కు ఇచ్చే నిజమైన నివాళి అని తెలిపారు. ముస్కిన్ కుటుంబానికి సిపిఎం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల రంగయ్య, సిపిఎం నగర కమిటీ నాయకులు ప్రకాష్ రెడ్డి, మన్నెల రామాంజి, రాజు, వెంకటేష్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు రామంజినమ్మ, ఆవాజ్ నాయకులు నూరుల్లా, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గూగూడు కుళ్లాయిస్వామి ప్రథమ దర్శనం

గూగూడు కుళ్లాయిస్వామి ప్రథమ దర్శనం

పోటెత్తిన జనం

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని గూగూడు గ్రామంలో కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారి తొలి దర్శనం లభించింది. స్వామివారి ప్రథమ దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. కుళ్లాయిస్వామిని చూడగానే భక్తులు పెద్దపెఎత్తున 'కుళ్లాయి స్వామి గోవిందా..గోవింద.. అంటూ స్మరించారు. ఇకపోతే ఆదివారం నుంచి 13రోజులపాటు గూగూడులో కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టాలైన స్వామివారి చిన్న సరిగెత్తు 14న, పెద్ద సరిగెత్తు 16న, స్వామివారి అగ్నిగుండ ప్రవేశం 17వతేదీ తెల్లవారుజామున, అదేరోజు సాయంత్రం స్వామివారి జలధి కార్యక్రమం ఉంటుంది. 19న రాత్రి కుళ్లాయిస్వామి చివరి దర్శనంతో ఉత్సవాలు ముగుస్తాయి. స్వామి దర్శనానికి రాష్ట్రం నుండే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలిరానున్నారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి సాకేతపురం శోభ తెలిపారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడమే లక్ష్యం

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్పించడమే తన అంతిమ ఆశయమని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం అనంతపురంలోని రుద్రంపేట బైపాస్‌లో ఉన్న వాల్మీకి కళ్యాణ మండపంలో వాల్మీకి ప్రజాప్రతినిధుల ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి జాతిని ఎస్టీ జాబితాలో చేర్పించేందుకు తనవంత కృషి చేస్తూనే ఉన్నాయన్నారు. అయితే ఈసారి తనకు అదనపు బలగం చట్టసభల్లోకి వచ్చిందన్నారు. టిడిపి నుంచి ఇద్దరు, వైసిపి నుంచి మరొకరు అసెంబ్లీలో, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పార్లమెంట్ సభ్యులుగా ఉండటం తనకు మరింత బలాన్ని చేకూర్చిందన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్పించేందుకు తనవంతు కృషి బలంగా చేస్తానని హామీ ఇస్తూ ఒకింత ఉద్వేగానికి లోనయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, ఎమ్మెల్సీ మంగమ్మ, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గంగాధర్, ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, కోశాధికారి కిషోర్‌కుమార్, నాయకులు రమణ, సుధాకర్, జయప్రసాద్, కృష్ణమూర్తి, నరహరి, శ్రీధర్, ఓబులేసు, అమరావతి ఆసుపత్రి అంకే ముత్యాలన్న, వివిధ జిల్లాల నుంచి వచ్చిన వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

సజావుగా ఇపిఎఫ్ఒ పరీక్ష

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

నగరంలోని పలు కళాశాలల్లో ఆదివారం జరిగిన ఇపిఎఫ్ఒ పరీక్షలు సజావుగా సాగాయి. ఉదయం ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాల, ఎస్ఎస్‌బిఎన్ జూనియర్ కళాశాలలో పరీక్షలు నిర్వహించగా మధ్యాహ్నం ఆర్ట్స్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల, జెఎన్‌టియులో పరీక్షలు నిర్వహించారు. యుపిఎస్‌సి నిర్వహించే ఇపిఎఫ్ఒ (పర్సనల్ అసిస్టెంట్ ఇన్ ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్) పరీక్షలను కలెక్టర్ వినోద్‌కుమార్ పరిశీలించారు. ఉదయం 9:30 గంటల నుంచి 11:30 గంటల వరకు నిర్వహించిన పరీక్షలకు మొత్తం 434 అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 117 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. 317 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 2109 అభ్యర్థులకు గాను 1712 మంది హాజరయ్యారు. ఈ పరీక్షాకేంద్రాలను కలెక్టర్‌తో పాటు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, తదితరులు పరశీలించారు.



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

కల్తీ ఆహారంపై జాగ్రత్తలు అవసరం

కల్తీ ఆహార నియంత్రణ జిల్లా అధికారి రామచంద్ర





ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

కల్తీ ఆహారం తీసుకోవడం వల్ల అనేక రోగాలు కొని తెచ్చుకున్నట్లు ఉంటుందని ఆహార పదార్థాలు పట్ల ప్రజలు జాగ్రత్త వహించాలని జిల్లా ఆహార నియంత్రణ అధికారి రామచంద్ర హెచ్చరిస్తున్నారు. సమాజం వేగంగా అభివృద్ధి చెందుతుండడంతో అంతే వేగంగా కల్తీ ఆహార పదార్థాలు ఎక్కడపడితే అక్కడ విక్రయాలు జరుగుతున్నాయి. వాటిని తినటం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారు. హోటళ్లలో, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో, కిరాణా షాపులలో ఈ కల్తీ యథేచ్ఛగా జరుగుతోంది. ప్రజలు అప్రమత్తంగా తగు జాగ్రత్తలు పాటించకుంటే ఆస్మా, క్యాన్సర్ తదితర రోగాలకు గురికావాల్సి వస్తుంది. నేడు ఏ వస్తువు చూసినా కల్తీమయం అవుతోంది. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినాకల్తీ అనేది సర్వసాధారణమవుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా కల్తీ ఆహార నియంత్రణ అధికారి రామచంద్ర ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను తెలియజేశారు.

ప్రశ్న : ఆహార కల్తీ ని ఎలా నిర్ధారిస్తారు? తీసుకునే చర్యలు ఏమిటి?

జవాబు: కల్తీ ఆహారం నియంత్రించడానికి భారత ప్రభుత్వం 2016లో చట్టం తెచ్చింది. దీని ప్రకారం ఏడాదికి రూ.12 లక్షల వరకు టర్నోవర్ ఉన్న వ్యాపారులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకొని లైసెన్స్ పొందాలి. లైసెన్స్ లేని వారికి ఒక సంవత్సరం జైలు శిక్షతోపాటు ఆరు లక్షల వరకు జరిమానా ఉంటుంది. హోటళ్లలో, కిరాణా షాపులలో కాలం చెల్లిన వస్తువులు అమ్మితే నేరం. కల్తీ ఉన్న ఆహార పదార్థాలను హైదరాబాదులోని ల్యాబ్ కు శాంపిల్ పంపడం జరుగుతుంది. అక్కడ నుంచి 20 రోజులకు కల్తీ ఆహారం పై నివేదికలు వస్తాయి. వాటి ఆధారంగా కోర్టులో చట్టపరంగా శిక్షలు వేస్తారు. రిజిస్ట్రేషన్, లైసెన్సులు అన్ని ఆన్‌లైన్ లో జరుగుతాయి.

ప్ర : ఇప్పటివరకు ఎన్ని కేసులు నమోదు చేశారు ?

జ : శ్రీ సత్యసాయి జిల్లా కొత్తగా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు సుమారు 312పైగా కేసులు నమోదయ్యాయి. వీటిలో సురక్షితం కానివి, మిస్ బ్రాండ్ కేసులు నమోదు కాగా వాటిని బట్టి కోర్టులు వివిధ రకాలుగా శిక్షలు వేసాయి.

ప్ర : కల్తీ అనేది ఏ ప్రాతిపదికన నిర్ధారిస్తారు ?

జ : కాలం చెల్లిన వస్తువులు విక్రయించడం చట్టరీత్యా నేరం. హోటళ్లలో వాడిన నూనెను తిరిగి రెండు మూడు రోజులుగా వాడుతుంటారు. దానివల్ల క్యాన్సర్, ఆస్మా లాంటి రోగాలు వస్తాయి. ముఖ్యంగా ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో వాడిన నూనెను వాడుతూ ఉంటారు. ప్రస్తుతానికి అవి తినేటప్పుడు రుచికరంగా ఉన్నా వాటి వల్ల ఎన్నో అనర్థాలు జరుగుతాయి. కిరాణా షాపులలో గడువు ముగిసిన వస్తువులను విక్రయిస్తుంటారు. వాటిని వినియోగదారులు తీసుకోరాదు.

ప్ర : ప్రజలకు మీరు ఇచ్చే సలహాలు, సూచనలు ఏమిటి ?

జ : వస్తువులను కొనే ముందు ఎప్పుడు తయారు చేశారు. వస్తువుకు నిర్దేశించిన గడువు గమనించి కొనుగోలు చేయాలి. ఎట్టి పరిస్థితులలో గడువు పూర్తి అయిన వస్తువులను కొనరాదు. తాత్కాలికంగా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల పదార్థాలు రుచిగా ఉన్నప్పటికీ ఆయిల్ ఫుడ్ ను తినడం వల్ల రోగాలను మనమే కొని తెచ్చుకున్న వారమవుతాము. తాజాగా వేడివేడి పదార్థాలనే భుజించాలి. ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలి.

ప్ర : కల్తీ ఆహారంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారా?

జ : పాఠశాలల్లోనూ, అవకాశం వచ్చిన ప్రతిచోట కల్తీ ఫుడ్ పైన తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతూ ఉన్నాం. కొత్త జిల్లా ఏర్పడినందున తగినంత సిబ్బంది లేరు. వాహన సౌకర్యం కూడా లేదు. దీంతో ఇబ్బందులు పడుతూనే విధులు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయాల్సుంది.

ప్రజాశక్తి
www.prajasakti.com

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించడం బాధ్యతగా తీసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారి పిలుపునిచ్చారు. ఆదివారం అనంతపురంలోని బీసీ బాలికల వసతి గృహంలో మొక్కలు నాటారు. అనంతరం గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మొక్కలు నాటించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారన్నారు. ఇందులో భాగంగానే అన్ని ప్రభుత్వ కార్యాలయంలో మొక్కలను నాటడంతో పాటు ప్రతి ఒక్కర ఒక మొక్కను దత్తత తీసుకోవాలని ప్రతిజ్ఞ చేయించారన్నారు. ఆయన పిలుపుమేరకు మొక్కలను నాటి దత్తత తీసుకున్నట్లు తెలిపారు. అలాగే వసతిగృహంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయానికి పుస్తకాలను అందజేసిన సుభాషిణికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులందరూ పుస్తకాలను బాగా చదివి విజ్ఞానవంతులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఒ ఓబుళమ్మ, అనంతపురం డివిజన్ సహాయ సంక్షేమ అధికారిణి సుభాషిణి, అనంతపురం హెచ్‌డబ్ల్యుఎస్ అసోసియేషన్ మస్తాన్, గౌరవాధ్యక్షులు మారుతీప్రసాద్, వసతిగృహ సంక్షేమ అధికారిణి మాధవీలత, తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటి నీరు పోస్తున్న సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారి, విద్యార్థినులు

నైతికతను ప్రబోధించేలా 'నబిరసూల్ సుభాషితాలు'

పుస్తకావిష్కరణ సభలో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం

నైతికతను ప్రబోధించే సుభాషితాలే.. నబిరసూల్ సుభాషితాలు అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ బాలసుబ్రమణ్యం అధ్యక్షత సీనియర్ కవి సామాజికవేత్త, కంబదూరి షేక్ నబిరసూల్ రచించిన 'నిత్య నవనీతం-నబి రసూల్ సుభాషితం' పుస్తకాన్ని అట్టహాసంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నబీరసూల్ కేవలం సాహిత్యానికే పరిమితం కాకుండా మిగతా కళారంగాలతో కూడా మమేకమై విశాలమైన సామాజిక జీవితాన్ని ఏర్పరచుకున్నారన్నారు. వారు రచించిన ఈ పుస్తకం ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. బండి నారాయణస్వామి, ప్రముఖ నాట్యాచారిణి, నృత్య కళా నిలయం ఛైర్‌పర్సన్ సంధ్యామూర్తి మాట్లాడుతూ ప్రతి ఉదయం తమకు నబిరసూల్ సుభాషితంతోనే మొదలవుతుందన్నారు. ఎంతో గొప్ప గొప్ప వాక్యాలను వారి గుదిగుచ్చి అద్భుతమైన నైతిక విలువలని అందరికీ పంచుతున్నారన్నారు. ఎస్కెయు పూర్వ రిజిస్ట్రార్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ నబిరసూల్ గొప్ప సహృదయత కలిగిన వారన్నారు. వారితో తనకు చిరకాల పరిచయం ఉందని, వారి ఈ రచన నన్ను ఎంతో ఆలోచింపజేసిందన్నారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ అసిస్టెంట్ జిల్లా గవర్నర్ విరుపాక్షిరెడ్డి మాట్లాడుతూ పుస్తకాలు చదవడం పూర్తిగా తగ్గిపోతున్న ఈరోజుల్లో నబిరసూల్ లాంటివారు పుస్తక రచన కృషి కొనసాగించి నైతికతను పెంపొందించే బాధ్యతను తీసుకోవడం గర్వకారణమన్నారు. రచయిత షేక్ నబీరసూల్ మాట్లాడుతూ తన జీవిత అనుభవాలే సుభాషితాలు అన్నారు. తన మీద ప్రేమతో ఈ కార్యక్రమానికి విచ్చేసిన తన చిన్ననాటి స్నేహితులు, జిల్లాలోని రచయితలు, మేధావులు, ఆలోచనపరులు, వివిధ సంఘాల బాధ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో త్యాగరాజు గానసభ అధ్యక్షులు సంపత్‌కుమార్, ఫర్ ద సొసైటీ వ్యవస్థాపకులు, అధ్యక్షులు పోతుల రాధాకృష్ణ, నాగేశ్వరాచారి, సమీక్షకులు జి.పేరిందేవి, జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్, కోశాధికారి వన్నప్ప కోటిగారి, ఉపాధ్యక్షులు గోసల నారాయణస్వామి, జిల్లా రచయితల సంఘం కార్యదర్శులు మధురశ్రీ, మిద్దె మురళీకృష్ణ, డాక్టర్ అంకే శ్రీనివాస్, సిద్ధగిరి శ్రీనివాసులు, సీనియర్ కవి చంశాస్త్రి, జాషువా కళాపీఠం నాగ లింగయ్య, నానీల నాగేంద్ర, తరిమెల అమీర్‌నాథ్‌రెడ్డి, బాల పెద్దన్న, గాయత్రి, ఓబులేసు, పాడుతా తీయగా సుధాకర్, దాసరి ఆదినారాయణ, ఒంటెద్దు రామలింగారెడ్డి, షేక్ రియాజుద్దీన్ జూటూరు షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



నబిరసూల్ సుభాషితాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు



గాండ్లసంఘం నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న అతిథులు

గాండ్ల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

అనంతపురం కలెక్టరేట్ : గాండ్లసంఘం జిల్లా నూతన కమిటీ ఆదివారం నగరంలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా నార్పల రాము, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సుభాష్ చంద్రబోస్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా విశ్రాంత ఎంపిడిఒ వెంకటరాముడు, జిల్లా కోశాధికారిగా లక్ష్మీనారాయణ ఇతర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. గాండ్ల సమస్యల పరిష్కారం కోసం న్యాయమన్న హక్కులు సాధన కోసం గార్డ సంఘం నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకురాలు గాండ్ల విషాలాక్షి, తదితరులు పాల్గొన్నారు.

9న వేలంపాట

నార్పల : నార్పల పంచాయతీలో 2024-25 సంవత్సరానికి సంబంధించి ఆదాయ వనరులకు మంగళవారం పంచాయతీ కార్యాలయంలో వేలంపాట నిర్వహించనున్నట్లు కార్యదర్శి అశ్వర్థనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్టాండు, మూత్రశాలలు, మరుగుదొడ్ల లీజుకు 9 నెలలపాటు లీజుకు ఇచ్చేందుకు బహిరంగ వేళంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు. బస్టాండుకు రూ.లక్ష, మూత్రశాల, మరుగుదొడ్లకు రూ.50వేల డిపాజిట్ చెల్లించాలని కోరారు.

గూగూడు ఉత్సవాలకు అదనపు పారిశుధ్య కార్మికులు

నార్పల : మండలంలోని గూగూడు కుళ్లాయిస్వామి ఉత్సవాలకు 40 మంది పారిశుధ్య కార్మికులను అదనంగా నియమించినట్లు ఎంపిడిఒ రాముడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా నార్పల మండలంలోని పంచాయతీ కార్యదర్శులు అందరూ పంచాయతీ కార్యదర్శులు వెంకటరెడ్డి, బొందలవాడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు చేస్తున్నారు. జిల్లా పంచాయతీ అధికారి ఎల్.ప్రభాకర్‌రావు సూచనల మేరకు పారిశుధ్య పనులే కాకుండా గ్రామ పంచాయతీ తరపు నుంచి వీధిలైట్ల ఏర్పాట్లు పనులు కొనసాగుతున్నాయి. భక్తులందరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

ఇసుక రీచ్ పరిశీలన

రాయదుర్గం రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నుంచి ఉచిత ఇసుక విధానాన్ని అమలులోకి తీసుకురానున్న నేపథ్యంలో మండల పరిధిలోని జుంజుజరంపల్లి ఇసుక రీచ్‌ను ఆర్‌డిఒ రాణిసుష్మిత ఆదివారం పరిశీలించారు. కాగా నేడు ఉదయం 6 గంటలకు ఉచిత ఇసుక ప్రారంభోత్సవం ఉంటుందని తహశీల్దార్ చిట్టిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఓ ప్రభాకర్‌రావు, అనంతపురం ఆర్టీవో సురేష్ నాయుడు, సర్వేయర్ బాలగంగయ్య, పంచాయతీ కార్యదర్శి అశోక్, సర్పంచి వన్నూరుస్వామి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఉచిత ఇసుక నిర్ణయం పేదలకు వరం

ప్రజాశక్తి-శింగనమల

రాష్ట్రంలోని పేదలకు ఉచితంగా ఇసుకను అందించేందుకు సిఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోవడం వరం అని టిడిపి సీనియర్ నాయకులు సోదనపల్లి అట్టే రామాంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో వైసిపి నేతలు ఇసుక మాఫియాగా ఏర్పడి దోచుకున్నారన్నారు. దీంతో పేదలు చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. ఇసుక లేక చాలామంది ఇళ్లను నిర్మించుకోలేకపోయారన్నారు. అయితే ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి రాగానే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నేటి నుంచి ఉచితంగా పేదలకు ఇసుకను అందుబాటులోకి తీసుకురావడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇందుకు సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణఖకు కృతజ్ఞతలు తెలిపారు. ఇకపోతే చంద్రబాబుతోనే రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. అలాగే నియోజకవర్గ సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరిష్కారానికి అధికారులను ఆదేశిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

రూ.7.56 లక్షల ఉత్పత్తుల అమ్మకాలు నిలుపుదల

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని రుద్రంపేటలో ఉన్న మానస, శ్రీబాలాజీ ఫర్టిలైజర్, పాతవూరులోని భారతి ఆగ్రో ఏజెన్సీస్ దుకాణాల్లో వ్యవసాయ శాఖ ఎడిఎ భాస్కరయ్య నేతృత్వంలో ఆదివారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులను నాణ్యతగా అందించాలన్నారు. పురుగు మందులు, విత్తనాలు, ఎరువులు, వాటి నాణ్యతపై అనుమానాలు ఉన్న వాటిని నమూనాలను సేకరించి నాణ్యత పరీక్షల కోసం ప్రయోగశాలకు పంపించనున్నట్లు తెలిపారు. రికార్డుల నిర్వహణలో లోపాలు ఉన్న వాటిని సరిదిద్దేందుకు కొన్ని రకాల ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను తాత్కాలికంగా అమ్మకాలను నిలుపుదల చేసినట్లు తెలిపారు. అనంతపురం మండల పరిధిలోని మూడు ఎరువుల దుకాణాల్లో రూ.1.39 లక్షల విలువజేసే విత్తనాలు, రూ.3.55 లక్షల విలువజేసే ఎరువులు, రూ.2.62 లక్షల విలువైన పురుగు మందులు అమ్మకాలను నిలుపుదల చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి విజయకుమార్, జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం సాంకేతిక వ్యవసాయ అధికారులు బాలునాయక్, రాకేష్‌నాయక్, అనంతపురం రూరల్ మండల వ్యవసాయ అధికారిణి జె.శశికళ, తదితరులు పాల్గొన్నారు.



అనంతపురంలో ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

శింగనమల : రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు రాష్ట్రమంతటా ఏకకాలంలో చేపట్టిన తనిఖీల్లో భాగంగా మండలంలోని బండమీదపల్లి గ్రామంలో ఉన్న స్వర్ణభూమి ఫర్టిలైజర్స్ ఎరువుల తయారీ కర్మాగారాన్ని డిఆర్‌సి ఎం.భాస్కరయ్య, తిరుపతి, విజిలెన్స్ ఆఫీసర్ విజయ్‌కుమార్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా కర్మాగారం లైసెన్స్, ఎరువుల రా మెటీరియల్ వివరాలు, ఎరువుల తయారీ వివరాలు, అమ్మకాలు, ల్యాబ్‌ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం ఎఒ బాలానాయక్, మండల వ్యవసాయ అధికారి, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో ఉపాధి

ప్రజాశక్తి-గుత్తి

సాంకేతిక పరిజ్ఞానంతో ఉపాధి అవకాశాలు లభిస్తాయని శ్రీసాయి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ జయ రంగారెడ్డి, ప్రిన్సిపాల్ కాంతారెడ్డి, యువశక్తి కంప్యూటర్ శిక్షణ సంస్థ బ్రాంచి డైరెక్టర్ అరుణ్‌కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీసాయి జూనియర్ కళాశాలలో యువశక్తి కంప్యూటర్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణ పూర్తయిన 110 మంది విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానంతో పాటు నైపుణ్యాలను అలవర్చుకోవాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో యువశక్తి కంప్యూటర్ శిక్షణ సంస్థ గుంతకల్లు బ్రాంచి డైరెక్టర్ టి. జయన్న, గణేష్, నూర్జహాన్, పెద్దన్న వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పూడికతీత పనులు

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గంలో సోమవారం నుంచి మురికి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం పట్టణంలోని డ్రెయినేజీ వ్యవస్థను ఎమ్మెల్యే పరిశీలించారు. వర్షాలు వస్తే లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికావడంతోపాటు ప్రధాన మురికి కాలువ పూడిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగునీటి వ్యవస్థ బాగుకోసం ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగానే నేటినుంచే ప్రధాన మురికి కాలువల్లో పూడికతీత పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. గతేడాది వర్షాకాలంలో ప్రజలు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ఇళ్లు, దుకాణాల్లోకి వర్షం నీరు చేరి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్న నేపథ్యంలో అలాంటి దుస్థితి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ పి.కిషోర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ జగదీష్, మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్లు గాజుల వెంకటేశులు, కడ్డిపూడి మహబూబ్‌బాషా, మాజీ వార్డు సభ్యులు టంకసాల హనుమంతు, వై.వెంకటేశులు, సంపత్‌కుమారి, టిడిపి పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



డ్రెయినేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

నేరాలు ఘోరాలు



జుంజుజరంపల్లి రీచ్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ రాణిసుస్మిత

పొలంలో పైపులు ధ్వంసం

పెద్దవడుగూరు : మండలంలోని చింతలచెరువు గ్రామానికి చెందిన మాజీ సర్పంచి, వైసిపి సానుభూతి పరుడు మహేశ్వర్‌రెడ్డి పొలంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పైపులను నరికివేసినట్లు బాధిత రైతు వాపోయాడు. ఈమేరకు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఉదయం వెళ్లిన పొలానికి వెళ్లి నరికివేసిన 34 పైపులను పరిశీలించారు. వీటి విలువ సుమారు రూ.50వేలు ఉంటుందన్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిన్న రెడ్డప్ప తెలిపారు.

నిత్యావసరాలు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షులు చల్లా కిషోర్



విలేకరులతో మాట్లాడుతున్న చల్లా కిషోర్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

అధిక ధరలకు నిత్యావసర సరుకులు విక్రయించినట్లు తమదృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షులు కిషోర్‌చౌదరి హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని స్వగృహంలో వినియోగదారుల సంక్షేమ సంఘం నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ వ్యాపారులు అధిక ధరలకు నిత్యావసర సరకులు విక్రయిస్తే వాట్సప్ ద్వారా తమకు సమాచారం చేరవేయాలన్నారు. సరుకులు తీసుకున్న వినియోగదారులకు కంప్యూటర్ బిల్లులు అందజేయాలన్నారు. దుకాణాల ముందు ధరల పట్టిక ఏర్పాటు చేయాలన్నారు. వినియోగదరుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినా, బిల్లులు అందజేయకపోయినా వాట్సప్ చాట్ ద్వారా వినియోగదారులు ఫిర్యాదు చేసే వెసులుబాటును కేంద్ర ప్రభుత్వం కల్పించిందన్నారు.

వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి-గుత్తి

రాష్ట్రంలోని ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్లను ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా సి.రమేష్ మాట్లాడుతూ ఏడు నెలల నుంచి పెండింగ్ మెస్, కాస్మోటిక్ ఛార్జీలను చెల్లించాలని డిమాండ్ చేశారు. శిథిలావస్థలో ఉన్న సంక్షేమ వసతి గృహాల భవనాలను స్థానంలో నూతన భవనాలను నిర్మించాలన్నారు. ప్రభుత్వ హాస్టల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు బాలాజీ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



హాస్టల్ పైకప్పును పరిశీలిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

బుడగ జంగాలకు ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వాలని వినతి



ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు వినతిపత్రం సమర్పిస్తున్న బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం నాయకులు

అనంతపురం కలెక్టరేట్

బేడ, బుడగ జంగాలకు ఎస్సీ సర్టిఫికెట్లు అందించేందుకు చొరవ చూపాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఎంపీ నివాసంలో కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కులస్థులకు ఎస్సీ సర్టిఫికెట్లు అందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు టిడిపి తరపున లేఖ రాయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం అధ్యక్షులు శిరిషాల అంజి, శిరిషాల రాంబాబు, బలగోల్ల చిన్న మారెన్న, ఎడవల్లి రమేష్, రాసుట్టి మధు, శిరిషాల మురళి, మోతి రాము, బలగోల్ల సురేష్ సిరివాటి శంకరయ్య, సిరిగిరి జమ్మయ్య, మోతి రమణ, రాజు, లక్ష్మయ్య, ఎలమర్తి కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని మారుతీనగర్ 1వ క్రాస్‌లో ఉన్న హర్షిత ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం రాచానపల్లిలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆసుపత్రి ఎండి డాక్టర్ రాము తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హర్షిత ఆసుపత్రిలో గ్యాస్ట్రో ఎంటరాలజీ (కోలనోస్కోపీ మరియు ఎండోస్కోపీ) జనరల్, లాపరోస్కోపిక్, లేజర్ సర్జరీస్ (జీర్ణ సమస్యలు, కడుపులో పుండ్లు, పిత్తాశయ రాళ్లు, ఫిస్టులా, ఫిషర్, ఫైల్స్, హెర్నియా, కడుపు నొప్పి సమస్యలు, కామెర్లు, ప్యాంక్రియాటైటిస్ అపెండిసైటిస్) ఆర్థోపెడిక్, గైనకాలజీ, చెవి, ముక్కు, గొంతు, జనరల్ మెడిసన్ తదితర వాటికి వైద్యం అందించనున్నట్లు తెలిపారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి : ఏపిటిఎఫ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఏపిడిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీ బి నరసింహులు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో ఏపీటీఎఫ్ అనంతపురం జిల్లా శాఖ కార్యవర్గ సమావేశాన్ని జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌డిఎ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా తాము అధికారంలోకి వచ్చాక ఉపాధ్యాయ ఉద్యోగులకు 12వ పిఆర్‌సి అమలు, ఆలస్యమైతే మధ్యంతర భృతిని వెంటనే ప్రకటిస్తామని, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందన్నారు. కావున వెంటనే కూటమి ప్రభుత్వం పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా జీవో 117తో ప్రభుత్వ పాఠశాలల్లో నానాటికి తగ్గిపోతున్న అడ్మిషన్లను పునరుద్ధరించడానికి తక్షణమే పాఠశాల విలీనాన్ని రద్దు చేసి ప్రాథమిక స్థాయి పాఠశాలలను ఒకటి నుండి 5వ తరగతి వరకూ కొనసాగేలా చర్యలు చేపట్టాలన్నారు. గత ప్రభుత్వం అసంబద్ధంగా, అశాస్త్రీయంగా ప్రవేశపెట్టిన జిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, ఓపిఎస్ అమలు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆగిపోయిన తెలుగు హిందీ ఆంగ్ల భాష పాఠశాల సహాయకుల ప్రమోషన్లను చేపట్టాలని డిమాండ్ చేశారు. అనవసర యాప్‌లు, ఆన్‌లైన్ డేటా ఎంట్రీలతో కాలయాపన చేస్తూ విలువైన బోధన సమయాన్ని వృథా చేయిస్తున్నారన్నారు. వెంటనే వాటిని తొలగించాలన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే ఆయా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపిటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎస్‌సి.రాజుద్దీన్, జిల్లా ఉపాధ్యక్షులు సతీష్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్లు రమణ, సర్దార్‌వలి, ఆడిట్ కమిటీ కన్వీనర్ కె.వన్నప్ప, నాయకులు పుల్లయ్య, హిమగిరి ప్రసాద్, రామమూర్తి, గోసుల నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, సురేష్, తిప్పేస్వామి, శ్రీనివాసులు, ఖలీముల్లాఖాన్, నస్రుల్లా, హనుమంతు, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపిటిఎఫ్ నాయకులు

13న యుటిఎఫ్ ఆధ్వర్యంలో టీచర్స్ క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన సంద ర్భంగా స్వర్ణోత్సవ సంబరాలు పురస్కరించుకుని జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ పెనుకొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జిల్లా స్థాయి టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో క్రికెట్ టోర్నీ కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ యుటి ఎఫ్ టోర్నీ కన్వీనర్‌గా జిల్లా కార్యదర్శి జిసి.నరేశ్ వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, నాయకులు నారాయణస్వామి, రామకృష్ణనాయక్, లక్ష్మయ్య, రాంప్రసాద్, సకల చంద్రశేఖర్, సురేశ్, రామాంజనేయులు, సాయిగణేశ్, వెంకటకిశోర్ పాల్గొన్నారు.

అండర్-19 చెస్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

అండర్-19 చెస్ పోటీలకు పట్టణంలోని బిఎస్‌కె చెస్ అకాడమీ క్రీడాకారులు ఎంపికయ్యారని చీఫ్ కోచ్ ఆది రత్నకుమార్ తెలిపారు. ఎంపికైన వారు ఈ నెల 12, 13, 14 తేదీల్లో నంద్యాలలో ఎపి చెస్ అసోసియేషన్ నిర్వహించే పోటీల్లో పాల్గొంటారు. ఈ నెల 7వ తేదీ హిందూపురంలో స్పార్టన్ చెస్ అకాడమీలో నిర్వహించిన జిల్లా ఓపెన్ పోటీల్లో అండర్-19 బాలుర విభాగంలో ఎస్.కేదార్‌నాథ్, పి.హర్షచైతన్య, అండర్-19 బాలికల విభాగంలో పి.సహస్ర ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి కలిసి పని చేస్తాం

మడకశిర : నియోజకవర్గ అభివృద్ధి కోసం కలిసి పని చేస్తామని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామి తెలిపారు. పట్టణంలోని యాదవ కళ్యాణ మండపంలో ఆదివారం ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో ఇండియన్ డిజైన్ గార్మెంట్స్ కంపెనీ ఉద్యోగాల నియామకాల ప్రక్రియ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గార్మెంట్స్ కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు. ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే పలమనేరు తిప్పేస్వామి ధన దాహానికి ఇండియన్ గార్మెంట్స్ యాజయాన్యం గత ఐదేళ్లలో రూ. 20 కోట్లు నష్టపోగా, ఇండియా ప్రభుత్వానికి దాదాపు రూ. 500 కోట్లు నష్టం వాటిల్లిందన్నారు. మడకశిర ప్రాంత నిరుద్యోగులు దాదాపు 10 వేల మంది ఉద్యోగావకాశాలు కోల్పోయారన్నారు. అలాంటి నీచ సంస్కృతికి తావు లేకుండా మడకశిర ప్రాంత అభివృద్ధి, నిరుద్యోగ సమస్య తీర్చాలనే సదుద్దేశంతో ఇండియన్ గార్మెంట్స్ యాజయాన్యంతో మాట్లాడి మడకశిర, రొళ్ల, గుడిబండలో గార్మెంట్స్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసమూర్తి, ఇండియన్ గార్మెంట్స్ సిబ్బంది, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం



ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ